
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ❘ 22 ❘ జనవరి ❘ 2024



సోమశిలలో 28.512 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 28.512 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.64,360
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,780
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,953
సవర (8 గ్రా)	- రూ.47,624

గరిష్టం/కనిష్టం
31.5 /23.5

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరాయి. సోమవారం కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నేడు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సీతారాముల కల్యాణం

వెంకటాచలం: అయోధ్యలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ కోఆర్డినేటర్ జనార్దన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ నేతృత్వంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్వర్ణభారత్ ట్రస్ట్, అక్షర విద్యాలయంలలో పలు కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఎన్నిక



నెల్లూరు(పొగతోట): ఏపీ జేఏసీ అమరావతి నెల్లూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా కె.బాలకోటమ్మ (రెవెన్యూ), డి.సుభాషిణి (ఆర్‌టీసీ) ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో నెల్లూరు జిల్లా మహిళా కమిటీ ఆవిర్భావ సభ నిర్వహించారు. అనంతరం నెల్లూరు జిల్లా మహిళా విభాగాన్ని ఎన్నుకున్నారు. ఏపీ జేఏసీ అమరావతి నెల్లూరు జిల్లా మహిళా విభాగం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వై.విజితారెడ్డి (సర్వశిక్ష అభియాన్), కోశాధికారిగా ఎం.దివ్యతేజ, ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకులు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పటిసెట్టి దామోదర్‌రావు, పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి, గంటా పావని, శరత్‌బాబు, ప్రసాద్, మురళి, చిరంజీవి, చిన్నయ్య, అల్లం సురేష్‌బాబు పాల్గొన్నారు.

హామీలన్నీ సంపూర్ణంగా నెరవేర్చాం



మాచర్లవారిపాళెం పంచాయతీలో సీసీ రోడ్లను ప్రారంభించిన మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా నెరవేర్చి సంక్షేమ పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తోటపల్లిగూడూరు మండలం మాచర్లవారిపాళెం గ్రామ సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి కాకాణి పాల్గొన్నారు. ముందుగా తోటపల్లిగూడూరులో నాయుడు దశరథరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను వారు ప్రారంభించారు. అనంతరం మాచర్లవారిపాళెంలో రూ.కోటితో సీసీ రోడ్లు, రూ.8.50 లక్షలతో ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణాలు పూర్తి కాగా వాటిని మంత్రి ప్రారంభించారు. అలాగే జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.50 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులకు ఎంపీ వేమిరెడ్డి, మంత్రి కాకాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి రూ.3 వేల చొప్పున పింఛన్ నగదు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్క మాచర్లవారిపాళెం పంచాయతీలోనే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు దాదాపు రూ.9 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అడిగిన వెంటనే రూ.1.08 కోట్ల ఎంపీ నిధులను మంజూరు చేసి కళాశాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.



మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి కాకాణి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, తాగునీటి సరఫరా మౌలిక వసతుల కల్పనకు మంత్రి కాకాణి కృషి చేస్తున్నారని తెలిపారు. నిత్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి కాకాణికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మంత్రి కాకాణితో కలిసి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

మాచర్లవారిపాళెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం రాత్రి మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాని, గణేష్‌తోపాటు 70 మంది కార్యకర్తలు ఉన్నారు. వారందరికీ మంత్రి కాకాణి వైఎస్సార్‌సీపీ కండవాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మంత్రి కాకాణిని, ఎంపీ వేమిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, ఎన్‌డీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత నాయుడు ఆదిశేషువులరెడ్డి, పేడూరు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోడూరు పురంధర్‌రెడ్డి, నాయుడు వెంకటనర్సారెడ్డి, నాయుడు సుధాకర్‌రెడ్డి, దువ్వూరు ప్రకాష్‌రెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, కైలాసం గోపి, చింత శ్రీనివాసులు, తాని తిరుపతి పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

నెల్లూరు(టౌన్): సంక్రాంతి పండగ సెలవుల అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. అనంతరం ఈ నెల 21వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను పొడిగించింది. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు.



చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- ఏఎస్‌పేట మండలం హసనాపురం నుంచి విజయీభవ యాత్ర ప్రారంభం

అనుమసముద్రంపేట: ప్రజా సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏఎస్‌పేట మండలం హసనాపురం గ్రామంలో 'విజయీభవ యాత్ర'ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అన్నివర్గాల ప్రజలను పలకరిస్తూ ముందుకుసాగారు. చేనేతలు నేసిన వస్త్రాలను పరిశీలించి వారితో మాట్లాడారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.11.15 లక్షలతో నిర్మాణం పూర్తయిన ప్రహరీని ఆయన ప్రారంభించారు. తదుపరి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు రూ.1,700 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన తమ ప్రభుత్వానికే ఓటు వేయాలని కోరారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్‌లో ప్రతి చెరువును అభివృద్ధి చేసి రైతుల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, సైడు కాలువలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. హసనాపురం గ్రామంలో రూ.5.2 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి పనులు చేశామని, 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో 132 సమస్యలు తమ దృష్టికి రాగా ఇప్పటికే 64 సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి సాగు చేసుకుంటున్న పేద రైతులకు ప్రభుత్వం పట్టాలు అందించిందని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ తమను ఆదరించి ఓటు వేస్తే మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం హసనాపురంలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, నాయకులు అంబటి కోటిరెడ్డి, జిలానీ, ఎస్.శ్రీనివాసులురెడ్డి, షబ్బీర్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు కూలీల పాకలు దగ్ధం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత

మర్రిపాడు: పొగాకు రెల్చుటకు వచ్చిన కూలీల పాకలు ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన మండలంలోని డీసీపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు..డీసీపల్లికి చెందిన పొగాకు రైతులు పొగాకు రెల్చుటకు బయటి ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చారు. వారు తాత్కాలిక పాకలు ఏర్పాటు చేసుకుని పొగాకు పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో పది పాకలు దగ్ధమయ్యాయి. కూలీల దుస్తులు, వంట సామగ్రి, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఆత్మకూరు ఆర్డీఓ కరబ మధులత ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వానికి నివేదించి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఊటబావిలో తేలియాడుతున్న మృతదేహం

అల్లూరు: మండలంలోని కొత్తసింగపేట గ్రామ పొలాల్లోని ఊట బావిలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని ఆదివారం రైతుల గుర్తించారు. అల్లూరు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై పీ శ్రీనివాసులరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికితీయించి నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి సుమారు 35 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చు. ముదురు ఆకుపచ్చ రంగు షాట్ ధరించి ఉన్నాడు. మృతుడు చనిపోయి దాదాపు పది రోజులు కావడంతో శవం బాగా కుళ్లిపోయి ఆనవాళ్లు గుర్తుపట్టలేని విధంగా తయారైందని ఎస్సై తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన వ్యక్తులు ఎవరైనా కనిపించకపోయినా, తమకు సంబంధించిన వ్యక్తి అని ఎవరికైనా అనుమానం ఉన్నా అల్లూరు పోలీస్ స్టేషన్‌లో లేదా 94407 96327 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఊపందుకున్న నిమ్మ ధరలు

- బస్తా కాయలు రూ.3,500



పొదలకూరు : నిమ్మ ధరలు ఊపందుకుంటున్నాయి. ఇటీవల చలిప్రభావంతో నిమ్మ ధరలు దిగజారాయి. ప్రస్తుతం చలి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో నిమ్మ ధరలు క్రమంగా పెరుగుతున్నట్లుగా వ్యాపారులు వెల్లడించారు. స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో కిలో నిమ్మకాయలు రూ.30 నుంచి రూ.45 వరకు ధర పలుకుతున్నాయి. లూజు(బస్తా) రూ.2,400 నుంచి రూ.3,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత కలిగిన కాయలకు మంచి ధరలు లభిస్తుండగా, మంచుప్రభావంతో నాణ్యత లోపించిన వాటికి గిట్టుబాటు ధరలు లభించడం లేదని రైతులు చెబుతున్నారు. కాగా మిచాంగ్ తుఫాన్‌తో తోటల్లోని చెట్లు కూలిపోవడంతో పాటు పూత, పిందె రాలిపోవడం వల్ల కాయల దిగుబడులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఫలితంగా సీజన్‌లో కాయలకు డిమాండ్ ఉండి మంచి ధరలు పలికే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎరువులు పుష్కలం

జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- మొత్తం ఎరువులు 1.63 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్
- యూరియా ఒక్కటే 83 వేల మెట్రిక్ టన్నులు అవసరం
- ఇప్పటికే 78 వేల మెట్రిక్ టన్నులకు పైగా సరఫరా



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : ఈ ఏడాది జిల్లాలోని రైతులు రబీ పంట సాగును ఆలస్యంగా ప్రారంభించారు. వర్షాభావ పరిస్థితులకు తోడు తుఫాన్ ప్రభావంతో నారుమడులు దెబ్బతినడంతో రైతులు కొంత ఆలస్యంగా నాట్లు వేశారు. జిల్లాలో వర్షాలు బాగా కురిసి పుష్కలంగా సాగునీరు ఉంటే సుమారు 8లక్షల ఎకరాల్లో రబీ పంట సాగుచేస్తారు. ఈ ఏడాది సోమశిలలో నీటి లభ్యత తక్కువ ఉన్న నేపథ్యంలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంట సాగుచేశారని అంచనా. రబీ సాగుకు వ్యవసాయాధికారులు ముందస్తుగా సంసిద్ధమయ్యారు. రబీ సాగుకు 1.63 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు డిమాండ్ ఉందని గుర్తించారు. ఆ మేరకు ఎరువులను గోదాముల్లో నిల్వ చేసి కొరత లేకుండా ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం కూడా రైతుల అవసరాల కన్నా ఎక్కువగానే జిల్లాకు ఎరువులను పంపుతోందని అధికారులు చెబుతున్నారు. అయినా జిల్లాలో ఎరువుల కొరత ఉందంటూ, ప్రధానంగా యూరియా రైతులకు అవసరమైన మేరకు సరఫరా చేయడం లేదంటూ కొన్ని పత్రికల్లో అసత్య ప్రచారాలు చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

78 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

వరి పంటకు రైతులు ఎక్కువగా యూరియాను వినియోగిస్తుంటారు. ఈ ఏడాది జిల్లాలో రబీ పంటకు 83 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, 95 వేల మెట్రిక్ టన్నులు పంపమని వ్యవసాయశాఖ అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈ మేరకు ఇప్పటికే 78 వేల మెట్రిక్ టన్నుల యూరియాను విడతల వారీగా జిల్లాకు పంపారు. మిగిలిన మొత్తం యూరియాను పంపేందుకు సిద్ధంగా ఉన్నారు. అలాగే డీఏపీ 19 వేల మెట్రిక్‌టన్నులు, సూపర్‌పాస్పేట్ 9,800 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 51,200 మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించగా, ఇప్పటికే పంపిణీ చేశారు. రైతుభరోసా కేంద్రాలతో పాటు సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అన్ని రకాల ఎరువులను నిల్వ చేసి సిద్ధంగా ఉంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులను ముందస్తుగా అప్రమత్తం చేసి రైతుల అవసరాల మేరకు ఎరువులను ఆర్‌బీకేల ద్వారా అందుబాటులో ఉంచుతోంది. దీంతో గత నాలుగేళ్లుగా రైతులు ఎరువులకు ఇబ్బందులు పడకుండా సాగు చేస్తున్నారు. కానీ నిజానిజాలు తెలుసుకోకుండా యూరియా కొరత ఉందంటూ అసత్య ప్రచారాలు చేయడం సరికాదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎరువులకు ఇబ్బంది లేదు



ఎరువులకు ఇబ్బంది లేదు. ఎక్కడా యూరియా కొరత లేదు. ఆర్‌బీకేల్లో, బయట మార్కెట్లో కావాల్సినంత దొరుకుతోంది. కానీ కొందరు రైతులు అవసరం కన్నా ఎక్కువగా కొనుగోలు చేసుకుని స్టాక్ పెట్టుకోవడం చూశాను.

–కే శ్రీనివాసులునాయుడు, రైతు, గండ్లవేడు, ఆత్మకూరు మండలం

కొరత లేదు



రబీ పంటకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు కొరత లేకుండా దొరుకుతున్నాయి. రైతుభరోసా కేంద్రాల్లో ముందుగా చెబితే త్వరగానే సరఫరా చేస్తున్నారు. ఆర్బీకేలతో పాటు బయట ప్రైవేట్ డీలర్ల వద్ద కొరత లేకుండా యూరియా దొరుకుతోంది.

–డీ మధుసూదన్, రైతు, మనుబోలు

అందుబాటులో ఉన్నాయి



జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదు. రబీ సాగుకు రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రబీకి కావాల్సిన దాని కన్నా ఎక్కువగానే ఎరువులను జిల్లాకు కేటాయించారు. కొందరు కావాలనే పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

వారితో నారాయణను పోల్చడం దౌర్భాగ్యం



ఇంటి పట్టాలు అందజేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టాటా, బిర్లాలతో నారాయణను పోల్చడం దౌర్భాగ్యమని నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్ ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ వారధిసెంటర్ ప్రాంతవాసులకు పార్టీలకతీతంగా ఇంటింటికి వెళ్లి ఇంటి పట్టాలను అందజేస్తున్నామని తెలిపారు. నిన్నటి రోజున టీడీపీ కార్యకర్తలు, ఎన్ టీం వారు ప్రచారంలో భాగంగా ఓ ఇంటికి వెళ్లగా కరోనా సమయంలో, నాలుగున్నరేళ్లుగా ఎన్నడూ కనిపించని నారాయణ కోసం ఎన్నికల ప్రచారం చేయడానికి వచ్చారా..ఈ నాలుగున్నరేళ్లలో మేం కనిపించలేదా అంటూ ఓ మహిళ నిలదీసిన వీడియో వైరల్‌గా మారిందన్నారు. అందులో ప్రచారానికి వచ్చిన వారిలోని ఓ వ్యక్తి టాటా, బిర్లాలు కరోనా సమయంలో ఏమైనా బయటకు వచ్చారా? మా నారాయణ ఎందుకొస్తారు? అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టాటా, బిర్లాలు కోట్ల రూపాయలు సాయం చేస్తారని, పిల్లికి కూడా బిచ్చం వేయని నారాయణను వారితో పోల్చడం చూస్తుంటే అంతకంటే దౌర్భాగ్యం ఇంకేమీ లేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ప్రజల వద్దకొచ్చి మీకు నేనున్నానంటూ ఎన్నికల స్టంట్లు వేస్తున్నారన్నారు. ఎన్నికలు పూర్తయితే ఆయనను ఆ పార్టీ వారు, ప్రజలు, కార్యకర్తలే కాదు కదా కనీసం నాయకులు కూడా కలవలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించి ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగర నియోజకవర్గంలో 25 పార్కులు, 8 అర్బన్ హెల్త్‌సెంటర్లు, ఇరుకు వీధుల్లోనూ రోడ్లు నిర్మించామని తెలిపారు. నగరాభివృద్ధిపై చర్చకు రమ్మంటే రాకుండా అన్నీ తానే అభివృద్ధి చేశానని నారాయణ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ దేవరకొండ సుజాత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.44
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 110
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 145

ఆకట్టుకున్న డాగ్ షో

- నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన
- పాల్గొన్న 30 జాతులకు చెందిన 200 శునకాలు
- డాగ్ షోను ప్రారంభించిన కమిషనర్ వికాస్‌మర్మత్



షోలో ప్రతిభను ప్రదర్శిస్తున్న శునకాలు

నెల్లూరు(బారకాసు): మనిషికి అత్యంత విశ్వాసమైన జంతువు శునకం. గతంలో ఇంటికి కాపలాకు మాత్రమే వాటిని పెంచుకునేవారు. కానీ ఇప్పుడు స్టేటస్ కోసం కూడా వాటిని పెంచి పోషిస్తున్నారు. దీంతో వీటిపై పెద్ద వ్యాపారమే నడుస్తోంది. దేశీయ రకాలతో పాటు విదేశీ జాతులు మనోళ్లకు పెట్స్‌గా మారుతున్నాయి. పెట్ డాగ్స్‌ను వాటిని యజమానులు మరింత అందంగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు వాటికి అందాల పోటీలను నిర్వహిస్తున్నారు. చిట్టిపొట్టి పప్పీలు, అందంగా కనిపిస్తూ చూపు తిప్పుకోకుండా ఆకర్షించే ముచ్చటైన విదేశీ జాతుల శునకాలు..ఒకే చోట అధిక సంఖ్యలో కనిపిస్తే మాటల్లో చెప్పగలమా.. నగరంలోని వీఆర్సీ క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన డాగ్ షోలో దేశ, విదేశీ విభిన్న జాతుల శునకాలు సందడి చేశాయి. నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ షో నగర వాసులను ఎంతగానో ఆకట్టుకుంది.

30 జాతులు, 220 శునకాలు

డాగ్ షోలో 30 జాతులకు చెందిన 200 శునకాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు డాగ్ షో కొనసాగగా, అప్పటి వరకు యజమానులు తమ పెట్స్‌ను జాగ్రత్తగా చూసుకున్నారు. అల్లాబై(రష్యన్ బ్రీడ్), సెయింట్ బర్నాల్, జర్మన్ షెపర్డ్(సింగిల్ కోట్, డబుల్ కోట్) డాష్, హస్కీ(మంచుడాగ్), లేబర్ డాగ్, రాట్ విల్లర్స్, గోల్డెన్ రిటీవర్, డాల్‌మెష్, గ్రేడెన్, జోనంగి, పిబుల్, బీగల్, టాయ్‌పామ్, బాక్సర్, బెల్జియం, ఎన్‌రైజ్, పగ్ తదితర జాతుల శునకాలు గ్యాలరీలో తిరుగుతూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. కుక్క జాతిని బట్టి ఎత్తు, బరువు కరెక్ట్‌గా ఉండి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్న ఐదింటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

కుక్కల పెంపకంతో మానసికోల్లాసం

కుక్కల పెంపకంతో మానసికోల్లాసాన్ని పొందవచ్చని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అన్నారు. డాగ్ షోకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల సాన్నిహిత్యంతో పనిఒత్తిడి తగ్గి మనసుకు స్వాంతన చేకూరుతుందని తెలిపారు. మెగా డాగ్ షో ద్వారా వివిధ మేలు జాతుల కుక్కలను నగర వాసులకు పరిచయం చేస్తున్నందుకు కెన్నల్‌క్లబ్ నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు షోలో ప్రదర్శించిన వివిధ జాతుల కుక్కలను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు, నెల్లూరు కెనల్ క్లబ్ అధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్యదర్శి సురేంద్రకుమార్, ట్రెజరర్ రాజు, మెడికల్ అడ్వైజర్ వెంకటస్వామిరెడ్డి, మారుతి షోరూం నిర్వాహకుడు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డాగ్ షోకు ముస్తాబై వచ్చిన జర్మన్ షెపర్డ్



కమిషనర్ వికాస్‌మర్మత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శునకం



షోకు వచ్చిన వివిధ జాతుల శునకాలు



ఆకట్టుకున్న చిన్నపప్పి

జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా జ్యోతిప్రసాద్



జ్యోతిప్రసాద్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా జ్యోతిప్రసాద్ ఎన్నికయ్యారు.పప్పులవీధిలోని శ్రీపాండురంగ అన్నదాన సమాజంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలకులుగా శ్రీరాంసురేష్, గాదంశెట్టి గోపాల్ వ్యవహరించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత మూడేళ్లుగా సంఘ అధ్యక్షుడిగా పేర్ల సీతారామారావు, ప్రధాన కార్యదర్శిగా జ్యోతిప్రసాద్ వ్యవహరించారన్నారు. ఆర్యవైశ్య మహాసభకు సంబంధించిన బైలాప్రకారం సంఘ ఎన్నికల షెడ్యూల్‌ను డిసెంబరులో విడుదల చేయడంతో పాటు ఆహ్వానాలను పంపడం జరిగిందన్నారు. నూతన అధ్యక్షుడిగా జ్యోతిప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం తాజీ మాజీ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, సంఘ నాయకులు గాదంశెట్టి గోపాల్, శ్రీరాం సురేష్, పేర్ల జనార్దన్‌రావు, వైభవ్ శ్రీనివాసులు మెంటా నరసింహారావు, నిరంజన్, పాదర్తి బాలాజీ , కొణిజేటి వీరబ్రహ్మం, బైసాని సత్యకృష్ణ, అర్బన్ ఆర్యవైశ్య మహిళావిభాగం నేతలు పాల్గొన్నారు.